
సాక్షి
గుంటూరు
గురువారం । 10 । ఆగస్టు । 2023



అమరేశ్వరుని సేవలో...

అమరావతి: బాలచాముండికా సమేత అమరేశ్వర స్వామిని సౌత్ సెంట్రల్ రైల్వే ప్రిన్సిపల్ ఫైనాన్షియల్ ఎడ్వయిజర్ వెంకటరెడ్డి బుధవారం దర్శించుకున్నారు.



డెల్టాకు 3,503 క్యూసెక్కులు

తాడేపల్లిరూరల్: కృష్ణా పశ్చిమ డెల్టా ప్రధాన కాలువకు సీతానగరం వద్ద 3,503 క్యూసెక్కులు బుధవారం విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 1,260 క్యూసెక్కులు వదిలారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 515.40 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

ప్రగతికి కట్టుబడి

పాఠశాలలకు మహర్దశ పట్టింది.. నాడు- నేడు కింద ప్రభుత్వం కార్పొరేట్ లుక్ తీసుకొస్తోంది.. గతంలో తరగతి గది ఉంటే తలుపులుండవు.. కిటికిలుంటే పైకప్పు ఉండదు.. నేలపైనా.. చెట్ల కింద చదువులు.. టేబుళ్ల సంగతి దేవుడెరుగు.. వర్షం వస్తే స్కూల్‌కు సెలవే.. మౌలిక వసతుల కోసం విద్యార్థులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి. ఇదంతా గతం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. అందులో భాగంగా నాడు- నేడు కింద అభివృద్ధి పనులు చేపట్టారు. కార్పొరేట్‌ను తలదన్నేలా అభివృద్ధి చేశారు.. రెండో విడత పనులు శరవేగంగా సాగుతున్నాయి.

- శరవేగంగా పాఠశాలల్లో నాడు- నేడు రెండో దశ పనులు
- రూ.214.55 కోట్లతో అభివృద్ధి
- కొత్తగా 834 అదనపు తరగతి గదుల నిర్మాణం
- బ్రాండెడ్ మెటీరియల్ సరఫరా



గుంటూరులోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులు



ఆర్వో వాటర్ ప్లాంటు

గుంటూరు ఎడ్యుకేషన్: నాడు- నేడు పథకం కింద రెండో దశలో 561 పాఠశాలలను ప్రభుత్వం ఎంపిక చేసింది. మొదటి దశలో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 1,149 పాఠశాలలను అభివృద్ధి చేసింది. రెండో దశలో ఆధునికీకరణ పనులకు రూ.214.55 కోట్లు మంజూరు చేసింది. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులతో కూడిన పది అంశాల ప్రతిపాదికన పనులు చేపట్టారు. విద్యార్థుల సంఖ్యకు అవసరమైన విధంగా అదనపు తరగతి గదులు నిర్మిస్తున్నారు.

మౌలిక వసతులు ఇలా..

నాడు- నేడు రెండో విడతలో ఆధునికీకరణ పనులు చేపట్టారు. పాఠశాలలు, కళాశాలల్లో 10 కాంపొనెంట్స్ వారీగా మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు తరగతి గదులు నిర్మాణం చేపట్టారు. బ్రాండెడ్ మెటీరియల్ సరఫరా చేస్తున్నారు. డ్యూయల్ డెస్కులు, ఉపాధ్యాయులు కూర్చునేందుకు అవసరమైన ఫర్నీచర్‌ను అందిస్తున్నారు. ప్రతి పాఠశాలకు కొత్తగా విద్యుత్ సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. ప్రతి పాఠశాలకు కనీసంగా రూ.25 లక్షలు మొదలు అత్యధికంగా రూ.2.50 కోట్ల వరకు కేటాయించారు. ప్రతి పాఠశాలలోనూ సురక్షితమైన తాగు నీటి కోసం ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. విద్యార్థినీ, విద్యార్థులకు వేర్వేరుగా టాయిలెట్స్ బ్లాకుల నిర్మాణం చేపడుతున్నారు. టాయిలెట్లలో ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి తరగతి గదిలో సీలింగ్ ఫ్యాన్లు, ఎల్ఈడీ లైట్లు, ఐఎఫ్ ప్యానెల్స్ వంటి వసతులను కల్పిస్తున్నారు.

రెండు విడత పనులు ఇలా..	
జిల్లాలో ఎంపికైన పాఠశాలలు	561
నిధులు మంజూరు	రూ.214.55 కోట్లు

అదనపు తరగతి గదులకే రూ.104.24 కోట్లు

జిల్లా వ్యాప్తంగా 561 పాఠశాలల పరిధిలో పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నాడు- నేడు ద్వారా ఆధునికీకరణ పనులు చేపట్టాడు. ప్రభుత్వం ఖర్చు చేస్తున్న మొత్తంలో దాదాపు సగం అదనపు తరగతి గదుల నిర్మాణానికే వినియోగిస్తోంది. జిల్లాకు కేటాయించిన రూ.214.55 కోట్ల నిధుల్లో 104.24 కోట్లను 834 తరగతి గదుల నిర్మాణానికి కేటాయించింది. మిగిలిన రూ.110.31 కోట్లతో ఆయా పాఠశాలల్లో 10 అంశాల వారీ మౌలిక వసతులు కల్పిస్తున్నారు.

పనులు వేగవంతం చేశాం

నాడు- నేడు రెండో విడతలో ఎంపిక చేసిన పాఠశాలల్లో 10 అంశాల ప్రాతిపదికన మౌలిక వసతులను కల్పించడంతో పాటు విద్యార్థుల సంఖ్యకు అవసరమైన విధంగా అదనపు తరగతి గదుల నిర్మాణం పురోగతిలో ఉన్నాయి. పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తున్నాం. పనుల పురోగతిని బట్టి ప్రభుత్వం ఎప్పటికప్పుడు నిధులు విడుదల చేస్తోంది.

\- పి.శైలజ, జిల్లా విద్యాశాఖాధికారి, గుంటూరు

ఇప్పటి వరకు రూ.1.20 కోట్లతో పనులు

నాడు-నేడు రెండో విడతలో మా కళాశాలను ఆధునికరించేందుకు ప్రభుత్వం రూ.1.32 కోట్లతో పనులకు పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా 39 టాయిలెట్లతో కూడిన బ్లాక్ నిర్మాణం పూర్తి కావొచ్చింది. 100 డ్యూయల్ డెస్కులు వచ్చాయి. అన్ని తరగతి గదుల్లో విద్యుదీకరణ పూర్తి చేసి, ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన రెండు ఆర్వో వాటర్ ప్లాంట్లు పని చేస్తున్నాయి. ఇప్పటి వరకు చేసిన పనులకు రూ.1.20 కోట్లు విడుదల చేయగా, మరో రూ.12 లక్షలు రావాల్సి ఉన్నాయి.

\- జి.సునీత, ప్రిన్సిపాల్, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, గుంటూరు

పేదింట్లో పెళ్లికి ఆర్థిక చేయూత



లబ్ధిదారులకు నమూనా చెక్కు అందిస్తున్న జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి, ఏసురత్నం, ఎమ్మెల్యేలు కిలారు రోశయ్య, ముస్తఫా, మద్దాళి గిరిధర్ తదితరులు

- కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి
- 446 జంటలకు రూ.4.06 కోట్ల లబ్ధి
- వైఎస్సార్ కల్యాణ మస్తు, షాదీ తోఫా లబ్ధిదారుల ఖాతాల్లో జమ

గుంటూరు: పేదింట్లో వివాహం భారం కాకూడదని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది వారికి ఇతోధికంగా ఆర్థిక తోడ్పాటు అందిస్తోందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం క్యాంపు కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మూడో విడత వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా పథకం కింద నగదును లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేశారు. వర్చువల్‌గా నిర్వహించిన కార్యక్రమాన్ని స్థానిక కలెక్టరేట్ నుంచి వీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 446 జంట్లకు రూ.4.06 కోట్లు ఖాతాల్లో జమయ్యాయన్నారు. అనంతరం నూతన దంపతులను కలెక్టర్, ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, చంద్రగిరి ఏసురత్నం ఆశీర్వదించారు. అనంతరం లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, మొహమ్మద్ ముస్తఫా, కిలారి రోశయ్య, చేనేత కార్పొరేషన్ చైర్మన్ గంజి చిరంజీవి, కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం, వైఎస్సార్ సీపీ తాడికొండ ఇన్‌చార్జి కత్తెర సురేష్ కుమార్, గుంటూరు మార్కెట్ యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, సివిల్ సప్లయిస్, ఆర్అండ్‌బీ, కృష్ణ బలిజ పూసల కార్పొరేషన్ల డైరెక్టర్ గనిక జాన్సీ, పిల్లిమేరి, కాలేటి నిర్మల, రాష్ట్ర టూరిజం శాఖ డైరెక్టర్ పఠాన్ జమీరా బేగం, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ ఆబిదా షరీఫ్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బి.దేవానంద్, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్ పాల్గొన్నారు.

పేదలకు ఎంతో మేలు



ఆడపిల్ల పెళ్లంటే పేదలకు అంత సులభం కాదు. ప్రభుత్వం నుంచి రూ.లక్ష వచ్చింది. నా భార్య తల్లికి ఇచ్చా. పెళ్లి ఖర్చులకు చాలా అయింది. నేను ఒక సంస్థలో గుమస్తాగా పనిచేస్తున్నా. వివాహానికి డబ్బులు ఇస్తామంటే లంచాలు ఇవ్వాలి అనుకున్నా. ఎక్కడా రూపాయి కూడా లేకుండా నాకు పథకం కింద నేరుగా డబ్బులు బ్యాంకులో జమ అయ్యాయి. ఇది నిజంగా అద్భుతమే. సీఎం వైఎస్ జగన్ రుణం తీర్చలేం

\-షేక్ సుభాని, షేక్ మస్తాన్‌బీ, గుంటూరు

చేతి వృత్తికి పెట్టుబడి



బీసీ కోటా కింద మాకు రూ.50 వేలు వచ్చాయి. నా భార్యకు టైలరింగ్ వచ్చు. తనకు ఈ మొత్తంతో మెటీరియల్ కొనుకుంటాం. ఇద్దరం కలసి పని చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. బ్యాంకులో రుణం రావాలంటే అంత సులభం కాదు. ఈ మొత్తం మా కుటుంబ అభివృద్ధికి దోహదపడుతుంది. ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు.

\-పి.శ్రీనివాసరావు, రేవతి, బావపాడు, అమరావతి మండలం

న్యూస్‌రీల్

సీసీఐ గుంటూరు ఆస్తుల విలువ రూ.1.859 కోట్లు

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ గుంటూరులోని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సీసీఐ) ఆస్తుల మొత్తం విలువ రూ.1.859 కోట్లు అని కేంద్ర జౌళిశాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. లోక్‌సభలో బుధవారం వైఎస్సార్ సీపీ ఎంపీ తలారి రంగయ్య ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. భూమి, భవనం, ఫర్నీచరు, కంప్యూటర్ ఎక్విప్‌మెంట్, కార్యాలయ ఎక్విప్‌మెంట్, వెహికల్స్ అన్నీ కలిపి ఈ మొత్తం విలువ అని తెలిపారు.

కారాగార కార్యకలాపాలపై అవగాహన



గుంటూరు లీగల్: ఏపీ హైకోర్టు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి పార్థసారథి ఆదేశాల మేరకు ప్రాక్టికల్ శిక్షణ నిమిత్తం 11 మంది జూనియర్ సివిల్ జడ్జిలు బుధవారం గుంటూరు జిల్లా కారాగారాన్ని సందర్శించారు. జిల్లా కారాగార పర్యవేక్షణాధికారి కె.రఘు ముద్దాయిలకు సంబంధించిన సౌకర్యాలు, వారికి కల్పించే న్యాయ సహాయం వివరాలు, కారాగార పరిపాలన తదితర అంశాలపై వారికి అవగాహన కల్పించారు. కోర్టులు, కారాగారాల మధ్య జరిగే కార్యకలాపాలను వివరించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జిలు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో కారాగార వైద్యాధికారి కె.లక్ష్మి పూర్ణలత, జైలర్లు బి.తేజేశ్వరరావు, సీహెచ్ కిరణ్, డిప్యూటీ జైలర్లు టి.వెంకటరత్నం, బి.శ్రీనివాసరావు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వందేభారత్ రైలులో పొగలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): తిరుపతి నుంచి సికింద్రాబాద్ వెళ్లే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20702) రైలులో బుధవారం పొగలు వ్యాపించడంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. ఈ ఘటనపై రైల్వే అధికారులు వివరణ ఇచ్చారు. బుధవారం తిరుపతి నుంచి సికింద్రాబాద్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలులో ఒక ప్రయాణికుడు తిరుపతిలో రైలు ఎక్కాడు. రైలు గూడూరు దాటిన తరువాత ఆ ప్రయాణికుడు సీ–13 కోచ్‌లోని టాయిలెట్‌లోకి వెళ్లి పొగ తాగుతుండగా టాయిలెట్ లోపల ఉన్న ఏరోసోల్ ఫైర్ వ్యవస్థ స్పందించి పొగతో కూడిన పొడర్‌ను విడుదల చేసింది. ఫలితంగా రైలులో పొగలు వ్యాపించడంతో ప్రయాణికులు భయపడ్డారు. ఎమర్జెన్సీ టాక్ బ్యాక్ యూనిట్ (ఈటీబీయూ) ద్వారా గార్డ్‌కు సమాచారం అందడంతో రైలును మనుబోలు వద్ద నిలిపివేశారు. ప్రమాదాన్ని పసిగట్టిన ఆన్ డ్యూటీ ఆర్‌పీఎఫ్ సిబ్బంది అగ్నిమాపక యంత్రాలతో ప్రమాదం జరిగిన కోచ్ వద్దకు చేరుకుని ప్రయాణికుల సాయంతో టాయిలెట్ అద్దాలను పగులకొట్టి పొగలో చిక్కుకున్న ప్రయాణికుడిని రక్షించారు. దీంతో రైలు మనుబోలు వద్ద సాయంత్రం 4.46 గంటల నుంచి 5.10 వరకు నిలిచిపోయింది. అనంతరం ఘటనకు కారకుడైన ప్రయాణికుడిని నెల్లూరు ఆర్‌పీఎఫ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రైలు ప్రయాణంలో నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించడం చట్టరీత్యా నేరమన్నారు. ఇటువంటి ఘటనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.

దక్షిణ భారత బ్యాడ్మింటన్ పోటీలకు క్రీడాకారులు



విజయవాడ స్పోర్ట్స్: దక్షిణ భారత బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌నకు ప్రాతినిధ్యం వహించే ఆంధ్ర రాష్ట్ర జట్టులో విజయవాడ క్రీడాకారులు చోటు దక్కించుకున్నారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటి వారు రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. జూనియర్ బాలుర విభాగంలో టి.హర్షన్, జి.దిలీప్‌కుమార్, బాలికల విభాగంలో టి.సూర్యచరిష్మ, డి.రష్మిత, సీనియర్ మహిళల విభాగంలో టి.సూర్యచరిష్మ, డి.రష్మిత, మమైఖ్య ఎంపికయ్యారు. ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు తమిళనాడు కోయంబత్తూరులోని పల్లికూడమ్ క్యాంపస్‌లో జరిగే దక్షిణ భారత బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో వారు పాల్గొంటారు. ఈ జట్లకు కోచ్‌గా వి.గంగాధరరావు, మేనేజర్‌గా డి.ధనలక్ష్మి వ్యవహరిస్తారు. రాష్ట్ర జట్టులో చోటు దక్కించుకున్న క్రీడాకారులను కృష్ణాజిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి పరసా శ్రీనివాస్ అభినందించారు.

యుద్ధప్రాతిపదికన అభివృద్ధి



మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు, వేదికపై ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, ఏసురత్నం, కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, ఎమ్మెల్యేలు ముస్తఫా, మద్దాళి, మేయర్ కావటి, జేసీ రాజకుమారి, కమిషనర్ కీర్తి

జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధర్మాన ప్రసాదరావు

గుంటూరు: మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ఇప్పటికే ప్రారంభించిన అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికపై పూర్తి చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు కోరారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. మంత్రి ధర్మాన మాట్లాడుతూ ఓవర్ బ్రిడ్జిలు, ఆర్‌ఓబీలు, రహదారుల విస్తరణ, మానస సరోవరం, బీఆర్ స్టేడియం, యూజీడీ, జీజీహెచ్ తదితర అభివృద్ధి పనులపై ప్రజాప్రతినిధులు నిరంతరం అధికారులను అప్రమత్తం చేయాలని చెప్పారు. పనులకు నిధుల కొరత లేదని పేర్కొన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ శంకర్ విలాస్ సెంటర్‌లోని పాత ఫ్లెఓవర్ స్థానంలో నూతన బ్రిడ్జి నిర్మాణం, శ్యామలా నగర్ ఆర్‌యూబీ, అడవితక్కెళ్లపాడు, టిడ్కో గృహాలను అభివృద్ధి చేయాలని కోరారు. నియోజకవర్గంలో మంజూరు చేసిన రోడ్లు, డ్రైనేజీలు వేగవంతం చేయాలని కోరారు. ఏటీ అగ్రహారం, సంపత్‌నగర్ లలో మంజూరు చేసిన సబ్ స్టేషన్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని విన్నవించారు. తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ రోడ్ల మరమ్మతులు, నూతన రోడ్లు నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని కోరారు. బీఆర్ స్టేడియంతో పాటు మానస సరోవరాన్ని పూర్తి చేస్తే నగరానికే వన్నె వస్తుందని చెప్పారు. కాకుమానువారి తోటలో ఉన్న కార్మిక శాఖ స్థలంలో కమ్యూనిటీ హాలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. రెడ్డిపాలెం వక్ఫ్‌బోర్డుకు చెందిన స్థలంలో మైనారిటీ కళాశాల, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

తక్షణం చర్యలు తీసుకుంటాం..

సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజాప్రతినిధులు లేవనెత్తిన అంశాలపై తక్షణం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. టిడ్కో గృహాల పెండింగ్ పనులు ఈ నెల 30 నాటికి పూర్తి చేయిస్తామని చెప్పారు. బీఆర్ స్టేడియంలోని వీధి దీపాలు, మరమ్మతులపై జీఎంసీ అధికారులు చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, డీఆర్వో చంద్రశేఖర రావు, హౌసింగ్ పీడీ వేణుగోపాలరావు, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు, గుంటూరు ఆర్డీఓ ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.

జగనన్నతోనే అభివృద్ధి సాధ్యం



పసుమర్రులో రక్షిత తాగునీటి పథకం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి విడదల రజిని

- పసుమర్రు వాసుల దశాబ్దాల కష్టాన్ని తీర్చాం
- గత ప్రభుత్వం తాగునీటి సమస్య తీర్చలేకపోయింది
- రూ.6 కోట్లతో సమస్యకు పరిష్కారం చూపాం
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో పల్లెసీమలు అభివృద్ధి పథం వైపు దూసుకుపోతున్నాయని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పురపాలక సంఘంలో విలీన గ్రామమైన పసుమర్రులో నాబార్డు నిధులు రూ.6 కోట్లతో నిర్మించిన రక్షిత తాగునీటి పథకాన్ని బుధవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా నెరవేరని కలగా మిగిలిన పసుమర్రుకు సాగర్ జలాల తరలింపు కార్యక్రమం ఈ రక్షిత తాగునీటి పథకం ద్వారా సాధ్యమైందని వివరించారు. దీని కోసం చిలకలూరిపేట తాగునీటి చెరువు సమీపం నుంచి పసుమర్రు వరకు పైప్‌లైను ఏర్పాటు చేసి సాగర్ నీటిని తీసుకువచ్చినట్లు తెలిపారు. గత ప్రభుత్వాలు కనీసం ఇక్కడి ప్రజలకు తాగునీటిని అందిద్దామని ఆలోచన చేయలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏకంగా రూ.6 కోట్లు నిధులతో తాగునీరు అందించే పనులకు శ్రీకారం చుట్టారని చెప్పారు. రోజుకు ఒక మిలియన్ లీటర్ల నీటిని గ్రామస్తులకు అందించే సామర్థ్యంతో ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ పథకం వల్ల ఏడు వేల జనాభాకు తాగునీటి అవసరాలు తీర్చే అవకాశం కలిగిందని వివరించారు.

ఎనిమిది వేల మందికి ఇళ్లు

పసుమర్రు గ్రామాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశామన్నారు. జగనన్న కాలనీలను కూడా ఇక్కడే ఏర్పాటు చేశామని తెలిపారు. 8 వేల మందికి ఇళ్ల నిర్మించేలా మూడు లేఅవుట్లు గ్రామ పరిధిలో అభివృద్ధి చేసినట్లు వివరించారు. ఇటీవల దాదాపు రూ.30 కోట్లతో వంద పడకల ఏరియా ఆస్పత్రి కల సాకారం చేసుకున్నామని చెప్పారు. నాడు- నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలకు మించిన హంగులు సంతరించుకున్నాయని పేర్కొన్నారు. వీటికి తోడు అదనంగా గురుకుల పాఠశాల విద్యార్థులకు కొత్త భవనాలు వచ్చాయని చెప్పారు. ఇప్పటికే రాజాపేటలో ఒక భవనం ప్రారంభించగా, త్వరలో బోయపాలెంలో మరో భవనం ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. కేంద్రీయ విద్యాలయాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు.

బైపాస్ పనులు వేగంగా..

పట్టణ ప్రాంతాల్లో డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు, గ్రామీణ ప్రాంతాల్లో డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. ఎన్నో ఏళ్లుగా కోర్టు వివాదాలు ఇతర కారణాలతో ఆగిపోయిన బైపాస్ రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు. రూ.700 కోట్లతో బైపాస్ నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, ఎంపీపీ దేవినేని శంకరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కోడె సుధారాణి, 15,16 వార్డు కౌన్సిలర్లు జాలాది సుబ్బారావు, షేక్ మస్తాన్‌వలి, కొమరవల్లిపాడు పీఏసీఎస్ అధ్యక్షుడు కొండవీటి ఆంజనేయులు పాల్గొన్నారు.

వైభవంగా కావడి మహోత్సవం



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



విమాన కావడి నిర్వహిస్తున్న యువకులు

వన్‌టౌన్ (విజయవాడపశ్చిమ): శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సేవా సమితి (తమిళ సంఘం) ఆధ్వర్యంలో విమాన కావడి మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వరుని భక్తులు నిర్వహించిన వివిధ రకాల పూజా కార్యక్రమాలు ఒళ్లు గగుర్పాటు కలిగించాయి. వీపునకు కొక్కేలను దించుకొని తాడుపై వేళాడుతూ నిర్వహించిన విమానకావడి భక్తులను తన్మయుల్ని చేసింది. వన్‌టౌన్‌లోని స్థానిక పాడివీధిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తమిళ భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామికి పూజలు నిర్వహించారు. ముగ్గురు యువకుల వీపు భాగానికి కొక్కేలను గుచ్చి, వారు గాలిలో వేళాడే విధంగా తాడుతో కడతారు. క్రేన్ సాయంతో భూమికి 20 అడుగుల ఎత్తులో 50 అడుగుల మధ్య ప్రయాణం చేస్తూ షణ్ముఖునికి పూజ నిర్వహించడమే విమానకావడిగా పేర్కొంటారు. ఈ విమానకావడిలో మూడు పర్యాయాలు భక్తులు వెనుకకు ముందుకు వెళ్లి వస్తారు. ఈ సందర్భంగా తొలిసారి దండ వేసి పూజ చేయడం, రెండోసారి కొబ్బరికాయ కొట్టి హారతి ఇవ్వడం, మూడో సారి నిమ్మకాయలను మంత్రించి భక్తులపైకి విసరడం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం పలువురు భక్తులు తమ వీపులకు ఇనుప కొక్కేలను తగిలించుకొని వాటితో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి విగ్రహాన్ని ఉంచిన ట్రాక్టర్‌ను లాగుతూ ముందుకు తీసుకెళ్లారు. పెద్ద సంఖ్యలో తమిళ భక్తులు పన్నీరుకావడి, పాలకావడి, పుష్ప కావడి తదితర మొక్కులను స్వామికి సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఊరేగింపు పాడివీధిలో ప్రారంభమై తారాపేట రైల్వేస్టేషన్, కాశేశ్వరరావు మార్కెట్ బస్‌టెర్మినల్, గద్దబొమ్మ సెంటర్, కెనాల్‌రోడ్డు మీదుగా కష్టానదికి చేరుకుంది. అక్కడి నుంచి రథం సెంటర్, బ్రాహ్మణవీధి మీదుగా కొత్తపేట కోమలవిలాస్ సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానానికి చేరుకొని భక్తులు మొక్కులు చెల్లించారు. సమితి నిర్వాహకులు కే.చిన్నిస్వామి మాట్లాడుతూ సుమారు 50 సంవత్సరాలుగా తమ సేవా సమితి ఆధ్వర్యంలో ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. స్వామి వారి అనుగ్రహంతోనే ఏటా విమానకావడి మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో శేఖర్‌స్వామి తమిళ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

12, 13 తేదీల్లో ఐలు రాష్ట్ర మహాసభలు

గుంటూరు లీగల్: ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలు) రాష్ట్ర మహాసభలు ఈనెల 12, 13 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆహ్వాన సంఘ చైర్మన్, ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు తెలిపారు. స్థానికంగా ఓ హోటల్‌లో మహాసభల వాల్‌పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నగరంలోని శుభం కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్న మహాసభలకు న్యాయవాదులు, న్యాయ విద్యార్థులు, ప్రజాస్వామికవాదులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలపై పని చేస్తున్న దేశంలో అతి పెద్ద సంఘంగా ఐలు ఉందన్నారు. ఈ మహాసభలను మొదటి రోజు మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భట్టు దేవానంద్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐలు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ బాబు, నగర అధ్యక్షుడు గండికోట శేషగిరిరావు పాల్గొన్నారు.

సంస్కృతిని కాపాడుతోంది ఆదివాసీయులే

- జేసీ రాజకుమారి
- ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం


వేదికపై ప్రసంగిస్తున్న జేసీ రాజకుమారి వేదికపై ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం

గుంటూరు వెస్ట్: నిస్వార్థమైన మనస్తత్వంతో ప్రకృతి వనరులను రక్షిస్తూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతోంది ఆదివాసీయులేనని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. బుధవారం స్థానిక రెవెన్యూ కల్యాణ మండపంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గిరిజన, ఆదివాసీలు తమ పిల్లల్ని విద్యావంతులను చేయడం ద్వారా మంచి భవిష్యత్‌ను ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే విద్య ఒక ప్రధాన మార్గమని, దీనిని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. ఆదివాసీలు ఉన్న దాంట్లోనే చేతి వృత్తులు చేసుకుంటూ ఉపాధి పొందుతారన్నారు. అడవి తక్కెళ్లపాడులో రూ.3 కోట్లతో నిర్మిస్తున్న గిరిజన భవన్ నిర్మాణం చివరి దశలో ఉందన్నారు. అది పూర్తయితే గిరిజనుల కార్యక్రమాలు అక్కడే నిర్వహిస్తామన్నారు. శాసన మండలి సభ్యులు చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ ఒకప్పుడు అడవి ప్రాంతాలకే పరిమితమై ఉండే ఆదివాసీలు ప్రభుత్వం అందిస్తున్న చేయూతతో ఉన్నత విద్యను అభ్యసించడం, ఉద్యోగాలు చేయడం వంటి వాటిలో ముందుంటున్నారన్నారు. అర్బన్ ప్రాంతాల్లో చాలా మంది గిరిజనులు, ఆదివాసీలు శాంతియుతమైన జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. వారి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ ఆసరా, అమ్మఒడి, వైఎస్సార్ చేయత, విద్యాదీవెనలాంటి అద్భుత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ ప్రారంభ దశలో అభివృద్ధి అడవిలోని గిరిజనుల నుంచే ప్రారంభమైందన్నారు. సాక్షాత్తూ మన దేశ రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన ఘనత వారికే దక్కుతుందన్నారు. సభలో చిన్నారులు చేసిన నృత్యాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. జేసీ రాజకుమారి చిన్నారులను దగ్గరకు తీసుకుని ఆప్యాయంగా ముచ్చటించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జ్ అధికారి మధుసూధనరావు, ఆప్కో చైర్మన్ చైర్మన్ గంజి చిరంజీవి, కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం, ఆర్‌అండ్‌బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లిమేరి, కృష్ణ బలిజ పూసల కార్పొరేషన్ డైరెక్టర్ కాలేటి నిర్మల, సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ గనిక జాన్సీ, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ ఆబిదా షరీఫ్, రాష్ట్ర టూరిజం శాఖ డైరెక్టర్ పఠాన్ జమీరా బేగం, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బత్తుల దేవానంద్, యానాది సేవ అభివృద్ధి, సంక్షేమ సంఘం అధ్యక్షులు ఏసుబాబు, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవసాయి చంద్రా నాయక్, యునైటెడ్ ట్రైబుల్ పరిషత్ ప్రెసిడెంట్ మందపాటి సంజయ్ బాబు, ఏసీ చెంచు సేవా పథకం అధ్యక్షులు పసుపులేటి వరప్రసాద్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్యస్ఫూర్తిని భావితరాలకు అందించాలి

- జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి
- రేపూడిలో అమృత్ సరోవరం కార్యక్రమం


మొక్కనాటి మట్టిపోస్తున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి

ఫిరంగిపురం: స్వాతంత్ర్యస్ఫూర్తిని భావితరాలకు ప్రతి ఒక్కరూ అందించాలని జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నాభూమి–నాదేశం, నేల తల్లికి వందనం, వీరులకు వందనం కార్యక్రమాలను బుధవారం మండలంలోని రేపూడి మంచినీటి చెరువు వద్ద అమృత్ సరోవరం కార్యక్రమాన్ని కలెక్టర్ వేణుగోపాలరెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. శిలాఫలకం వద్ద జ్యోతిని వెలిగించారు. స్వాతంత్ర్య సంగ్రామంలో అమరులైన వీరులకు నివాళులర్పించారు. దేశసేవకు ప్రతి ఒక్కరూ అంకితమవుదామని ప్రతిజ్ఞ చేయించారు. వసుధకు వందనంలో బాగంగా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు డి.కత్తిరేణమ్మ, ఎంపీపీ షేక్. షహేలా నర్గీస్, సర్పంచులు మేడాబాబు, డి.మెల్కియా, చిట్టా ఆంజిరెడ్డిలు మొక్కలు నాటారు. జాతీయ జెండాను ఆవిష్కరించారు. ప్రజలు, నాయకులు, అధికారులతో సెల్ఫీ దిగారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆజాదీకా–అమృత్ మహోత్సవంలో భాగంగా నాభూమి–నాదేశం వంటి కార్యక్రమాలు అధికారులు, ప్రజలు, నాయకుల భాగస్వామ్యంతో నేటి నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో మంచి ప్రదేశాన్ని ఎంపిక చేసుకొని శిలాఫలకాన్ని ఆవిష్కరించి దేశసేవకు పునరంకిత మవుదామని ప్రతిజ్ఞ చేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తి రేణమ్మ, ఎంపీపీ షేక్.షహేలా నర్గీస్, వైస్ ఎంపీపీ జి.చంద్రం, రాష్ట్ర ఖాదీబోర్డు మెంబర్ చిట్టా అంజిరెడ్డి, డ్వామా పీడీ యుగంధర్ కుమార్, కె.చిన్నప్పరెడ్డి, సర్పంచులు మేడాబాబు, డి.మెల్కియా, తహసీల్దార్ పద్మనాభుడు, ఎంపీడీవో డి.అనూరాధ, ఏవో రమణకుమార్, ఈసీ ప్రభాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు రామకృష్ణ, శ్రీనివాసరావు, సాయి, కార్యదర్శులు విష్ణువర్ధన్‌రావు, గణేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం

ఎస్ఎస్పీ కెనాల్, కొండవీటి సీ మైనర్ కాలువ దెబ్బతినడంతో రేపూడి రెవెన్యూ గ్రామ పరిధిలోని రైతులు సాగు, తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని కలెక్టర్ వేణుగోపాలరెడ్డికి రైతులు వినతి పత్రం అందజేశారు. వేసవికాలంలో మరమ్మతులు చేయకపోవడంతో గతనెలలో చెరువుకు తాగునీరు విడుదల చేసిన నీరు కల్వర్టులు కూలిపోవడంతో వృథాగా పోయి ఇబ్బందులు పడుతున్నామని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

డోర్ టు డోర్ సర్వేకు సహకరించాలి

కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: రానున్న ఎన్నికలకు పటిష్ట విధానాలతో పారదర్శకమైన ఓటర్ల జాబితాను తయారు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి సూచించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల, ప్రజాప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ స్పెషల్ సమ్మరీ రివిజన్–2024లో భాగంగా ప్రతిరోజూ బీఎల్‌ఓలు డోర్ టు డోర్ సర్వే చేస్తున్నారన్నారు. దీనికి ప్రజలు సంపూర్ణ సహకారమందించాలని కోరారు. ఇందులో ప్రజాప్రతినిధులు, బూత్ ఏజెంట్లు పాల్గొని సక్రమమైన ఓటర్ల లిస్టులు తయారు చేసే విధంగా కృషి చేయాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారు తప్పకుండా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. స్థానిక నాయకులు సహకారం అందించాలన్నారు. ఒకే డోర్ నెంబర్‌పై సంఖ్యకు మించిన ఓటర్లు ఉంటే తొలగించాలన్నారు. ఒకే డోర్ నెంబర్‌పై ఉన్న కుటుంబ సభ్యుల్లో కొందరికి ఒక పోలింగ్ బూత్ మరి కొందరికి మరో బూత్‌లో ఓట్లు ఉంటున్నాయన్నారు. దీనిని సరిచేసుకోవాలని సూచించారు. రాజకీయ నాయకులకు ఎటువంటి అభ్యంతరాలున్నా తమ దృష్టికి తీసుకు రావాలని కలెక్టర్ వివరించారు. సమావేశంలో తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖర రావు, గుంటూరు ఆర్డీఓ ప్రభాకరరెడ్డి, జిల్లా అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

యార్డుకు 32,071 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 32,071 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 31,171 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 26,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.12,000 నుంచి రూ.24,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.13,000 నుంచి 25,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 10,699 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సెంట్రల్ జోన్ మహిళా క్రికెట్ జట్టు విజయం


54 పరుగులు చేసిన సెంట్రల్ జోన్ బ్యాట్స్ ఉమెన్ అంజుమ్

మంగళగిరి: నవులూరు ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో బుధవారం ఏసీఏ అండర్ –19 ఉమెన్ ఇంటర్‌జోనల్ వన్డే మ్యాచ్‌లో నార్త్‌జోన్ జట్టుపై సెంట్రల్ జోన్ జట్టు 97 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సెంట్రల్ జోన్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 179 పరుగులు సాధించింది. జట్టు బ్యాట్స్ ఉమెన్లు మయస్సార్ అంజుమ్ 99 బంతుల్లో ఎనిమిది ఫోర్లతో 54 పరుగులు చేయగా మరో బ్యాట్స్ ఉమెన్ ఎండీ జక్రా మాహెక్ 57 బంతుల్లో నాలుగు ఫోర్లతో 30 పరుగులు చేసింది. నార్త్ జోన్ బౌలర్ పి.వెన్నెల మోహన్ నాలుగు ఓవర్లలో 21 పరుగులిచ్చి నాలుగు వికెట్లను సాధించింది. అనంతరం 180 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన నార్త్‌జోన్ జట్టు 32.1 ఓవర్లలో 82 పరుగులకే కుప్పకూలిపోయింది. జట్టు బ్యాట్స్ ఉమెన్ ఎస్‌హెచ్‌పీ హారిక 59 బంతుల్లో ఒక ఫోర్‌తో 20 పరుగులు చేసింది. సెంట్రల్ జోన్ బౌలర్ ఎం.పూజిత ఆరు ఓవర్లలో 14 పరుగులిచ్చి మూడు వికెట్లను పడగొట్టింది.

హత్య కేసులో ముద్దాయికి యావజ్జీవం

గుంటూరు లీగల్: హత్య కేసులో ముద్దాయికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ 12వ అదనపు జిల్లా జడ్జి, ఫ్యామిలీ కోర్టు జడ్జి పీవీఎస్ సూర్యనారాయణ మూర్తి బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. అచ్చంపేట మండలం, గ్రంధశిరి గ్రామానికి చెందిన కిలారి నాగేశ్వరరావు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కిలారి నాగేశ్వరరావుకు నరసరావుపేట మండలం, పమిడిపాడు గ్రామానికి చెందిన జంపాని నాగేశ్వరరావు వరుసకు బాబాయి అవుతాడు. జంపాని నాగేశ్వరరావు భార్య చనిపోవడంతో పిల్లల్ని అక్కడే వదిలి గ్రంధశిరి వచ్చి కిలారి నాగేశ్వరరావుకు చెందిన రేకుల షెడ్డులో ఉన్నాడు. కిలారి, జంపాని ఇద్దరూ రోజూ ఇక్కడే మద్యం తాగుతూ ఉండేవారు. మేకలు కొనుక్కునేందుకు కొంత డబ్బు అప్పుగా ఇవ్వమని జంపాని కోరగా కిలారి రెండు లక్షలు ఇచ్చాడు. మేకలను కొన్న జంపాని కొంతకాలం తరువాత వాటిని అమ్మేశాడు. అయితే కిలారికి ఇవ్వాల్సిన అప్పు డబ్బులు ఇవ్వలేదు. దీనికితోడు కిలారి తమ్ముడు వరదయ్య మృతి చెందడంతో ఆయన భార్య హేమలత జంపానితో చనువుగా ఉంటుంది. ఈ క్రమంలో 2020 డిసెంబర్ 29న కిలారి తన అత్తకు ఒంట్లో బాగోలేదని తెలిసి తన భార్యను తీసుకెళ్లి అదే గ్రామంలో ఉన్న ఆమె ఇంట్లో వదిలిపెట్టి వచ్చాడు. మరుసటి రోజు ఉదయం ఆమె వచ్చే సరికి భర్త ఇంట్లో లేకపోవడంతో వెతకడం ప్రారంభించారు. జంపాని నాగేశ్వరరావుపై అనుమానంతో గది వద్దకు వెళ్లి కిటికీలో నుంచి చూడగా కిలారి తలకు రక్తం కారుతూ మంచంపై పడి ఉన్నాడు. తాళం పగులకొట్టి లోపలికి వెళ్లి చూడగా కిలారి అప్పటికే మృతి చెంది ఉన్నాడు. పక్కన ఇనుప కొడవలి, పొడవాటి చేతి గొడ్డలి ఉంది. వాటికి రక్తం మరకలు ఉన్నాయి. జంపాని నాగేశ్వరరావు కూడా కనిపించకుండా పోయాడు. దీంతో జంపాని నాగేశ్వరరావు, కిలారి హేమలత, కావూరి వెంకట్రావుపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేసింది. పోలీసులు దర్యాప్తు అనంతరం చార్జిషీటు దాఖలు చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో జంపాని నాగేశ్వరరావుకు యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. మిగిలిన ఇద్దరిపై నేరం రుజువ కాకపోవడంతో కేసు కొట్టేశారు. ప్రాసిక్యూషన్ తరుపున ఏపీపీ సీహెచ్.వి.సత్యనారాయణ కేసును వాదించారు.

మానవత్వాన్ని చాటుకున్న జీజీహెచ్ వైద్యులు

అనాధకు చికిత్స అందించి.. క్షేమంగా స్వస్థలానికి..


మహేంద్ర విష్ణుభగత్‌ను స్వస్థలానికి పంపుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, వైద్యులు

గుంటూరు మెడికల్: ఇతర రాష్ట్రానికి చెందిన రోగి పక్క జిల్లాలో ప్రమాదానికి గురై చికిత్స కోసం జీజీహెచ్‌కు వచ్చాడు. జీజీహెచ్ వైద్యులు అనాధగా ఆసుపత్రిలో చేరిన వ్యక్తికి పెద్ద మనస్సుతో వైద్య సేవలు అందించి కోలుకున్న తరువాత అతడిని స్వస్థలానికి పంపించారు. వివరాల్లోకి వెళితే నాగపూర్‌కు చెందిన మహేంద్ర విష్ణుభగత్ గత నెల 21న నాగపూర్ నుంచి చెన్నై వెళ్తుండగా చీరాల రైల్వే స్టేషన్ వద్ద ప్రమాదానికి గురయ్యాడు. ప్రమాదంలో రెండు చేతులకు గాయాలయ్యాయి. గాయపడిన భగత్‌ను రైల్వే పోలీసులు గుంటూరు జీజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తీసుకుని వచ్చారు. ప్లాస్టిక్ సర్జరీ విభాగం వైద్యులు రోగికి అవసరమైన పరీక్షలు చేసి చేతులకు పోయిన చర్మాన్ని తిరిగి ఏర్పాటు చేశారు. రోగి బంధువులు ఎవరు లేకపోవడంతో ప్లాస్టిక్ సర్జరీ వైద్యులు అక్కున చేర్చుకుని వైద్య సేవలు అందించారు. ఆరోగ్యం పూర్తిగా కుదటపడడంతో అతడిని స్వస్థలానికి పంపించేందుకు ఆసుపత్రి సివిల్ సర్జన్ ఆర్‌ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్ ట్రైన్ టిక్కెట్ కొనుగోలు చేసి బుధవారం ఆసుపత్రి నుంచి నాగపూర్‌కు పంపించారు. ఈసందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ ఎవరూ లేని అనాధలకు సైతం జీజీహెచ్ వైద్యులు పెద్ద మనస్సుతో సేవలందించడమే కాకుండా, మానవతా దృక్పథంతో వారిని స్వస్థలానికి కూడా చేర్చడం అభినందనీయమని పేర్కొన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది చేస్తున్న సేవలు ఎంతో విలువైనవని కొనియాడారు. రోగి బంధువులు సైతం జీజీహెచ్‌లో అందిస్తున్న వైద్య సేవలపై సంతోషం వ్యక్తం చేశారని, వైద్యుల సేవలను జీవితాంతం గుర్తుపెట్టుకుంటామని చెప్పారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ గోవింద నాయక్, సివిల్ సర్జన్ ఆర్‌ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని, పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్‌ల ద్వారా జిల్లా ప్రజలకు సత్వర సేవలు


ల్యాప్‌టాప్‌లను అందజేస్తున్న పల్నాడు జిల్లా కలెక్టర్, సంస్థల ప్రతినిధులు

నరసరావుపేట: ల్యాప్‌టాప్‌ల ద్వారా జిల్లా ప్రజలకు సత్వర సేవలు అందించాలని మండల కో–ఆర్డినేటర్లను కలెక్టర్ ఎల్.శివశంకర్ కోరారు. ఆయన బుధవారం క్యూబ్ రూట్స్ ఫౌండేషన్, నామ్ ఎక్స్‌ప్రెస్‌వే లిమిటెడ్ సహాయంతో కమ్యూనిటీ డెవలప్‌మెంటు కింద కలెక్టరేట్‌లోని కమాండ్ సెంటర్‌లో పనిచేసే మండల– కో ఆర్డినేటర్లకు పది ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. నియోజకవర్గ–కో ఆర్డినేటర్‌కు ఒకటి, జిల్లాకు ఒకటి చొప్పున అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, క్యూబ్‌రైట్స్ పౌండేషన్ చైర్మన్, ఆ సంస్థ అధికారులు పాల్గొన్నారు.

పత్తిలో నానో యూరియా వినియోగించండి

జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎన్.వెంకటేశ్వర్లు


పంటలను పరిశీలిస్తున్న డీఏవో వెంకటేశ్వర్లు

ప్రత్తిపాడు: పత్తి పంటలో కనిపిస్తున్న బెట్ట వాతావరణ పరిస్థితులను అరికట్టేందుకు రైతులు నానో యూరియాను వినియోగించాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎన్. వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని ప్రత్తిపాడు, తిక్కిరెడ్డిపాలెం గ్రామాల్లోని పత్తి, సోయాచిక్కుడు పంటలను బుధవారం సాయంత్రం డీఏవో నున్నా వెంకటేశ్వర్లు పరిశీలించారు. పత్తి సాగు చేసిన రైతులతో మాట్లాడారు. పొలంలో బెట్ట పరిస్థితులు కనిపిస్తుండటంతో తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలను వివరించారు. పంటను కాపాడుకునేందుకు నానో యూరియాను ఎకరానికి ఒక లీటరు పిచికారీ చేయాలన్నారు. లేదా పొటాషియం నైట్రేట్ ఎకరానికి కేజీ పిచికారీ చేసుకోవాలని సూచించారు. పత్తి పంటను ఆశిస్తున్న రసం పీల్చు పురుగుల నుంచి పంటను కాపాడుకునేందుకు ఇమిడాక్లోరోప్రిడ్ ఒక ఎంఎల్ లేదా ఎసిటామిప్రైడ్ 160 గ్రాములు ఎకరానికి కలిపి పిచికారీ చేసుకోవాలని రైతులకు వివరించారు. గుంటూరు సహాయ వ్యవసాయ సంచాలకుడు తోటకూర శ్రీనివాసరావు, ప్రత్తిపాడు ఇన్‌చార్జి ఏవో బి. సుధారాణి, వీఏఏలు, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు చేరవేయడమే లక్ష్యం

సమీక్షలో అధికారులకు పల్నాడు జేసీ శ్యామ్ ప్రసాద్ ఆదేశం


అధికారులతో జిల్లా జాయింట్ కలెక్టర్

నరసరావుపేట: ప్రజలకు ప్రభుత్వ పథకాల్ని చేరువ చేసేందుకు జిల్లా అధికారులంతా కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ఏ. శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్ నుంచి బుధవారం ప్రభుత్వ పథకాల అమలుపై వెబెక్స్ ద్వారా ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానంగా అసైన్‌మెంట్ పరిధిలో వ్యవసాయ భూములు, లంక భూముల వివరాల సేకరణ, అర్హులకు వాటి పంపిణీపై చర్చించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం, ఓటీసీ, ఓటీఎస్, రీసర్వే, ఎఫ్‌వోఎల్‌ఆర్, ఎఫ్‌లైన్ పిటిషన్లు, ముటేషన్‌కు సంబంధించిన ప్రక్రియలు, తప్పుఒప్పులు సరిచేయడం, నీటితీరువ వసూలు, ఓఎల్‌సీఎంఎస్, ఇమామ్ భూముల అంశాలు, ఎన్నికల సర్వే ప్రక్రియ, ఈ– ఆఫీస్ వంటి అంశాలపై మండలాల వారీగా చర్చించారు. పనుల్లో ఎక్కడా జాప్యం లేకుండా జరిగేలా చూడాలని సంబంధిత శాఖ అధికారుల్ని ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకంతో పలు శాఖల ఉన్నతాధికారుల, అధికారులు పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమం, శ్రేయస్సుకు ప్రభుత్వం కృషి

- పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్
- ఘనంగా టౌన్‌హాలులో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం


కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ శివశంకర్, జెడ్పీ చైర్‌పర్సన్ హెన్రీ క్రిస్టీనా, ఎమ్మెల్యే గోపిరెడ్డి, అధికారులు, పలువురు గిరిజన నాయకులు

నరసరావుపేట: గిరిజనుల శ్రేయస్సు, సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని బుధవారం పురస్కరించుకొని గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో టౌన్ హాలులో నిర్వహించిన సభకు జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెన్రీ క్రిస్టీనా, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒకప్పుడు అందరూ ఆదివాసీలమేనన్నారు. కాలక్రమేణా వచ్చిన మార్పులతో కొందరు కొండలు, గుట్టలకే పరిమితం కావడంతో వారు గిరిజనులుగానే ఉండిపోయారని తెలిపారు. గిరిజనులు నివాసం ఉండే ప్రాంతాల్లో 2005 డిసెంబరు 5న తెచ్చిన చట్టం ప్రకారం వారికి భూములు కేటాయిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని వెల్దుర్తి, బొల్లాపల్లి, రాజుపాలెం లాంటి అటవీ ప్రాంతాలు ఉన్నచోట అవకాశం ఉన్నంతవరకు భూములు కేటాయిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటివరకు 3,900 మందికి ఏడు వేల ఎకరాల వరకు హక్కులు కల్పించామని వెల్లడించారు. జిల్లా పరిషత్ చైర్మన్ క్రిస్టీనా మాట్లాడుతూ గిరిజనుల్ని రాష్ట్రంలో ఉన్నతస్థాయికి తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, వారి అభ్యున్నతికి సంక్షేమ పథకాలు అమలు చేసి ఆర్థికాభ్యున్నతికి పాటుపడుతున్నారని వివరించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన విద్యార్థులతో నరసరావుపేటలో ట్రైబల్ వెల్ఫేర్ స్కూలు బ్రహ్మాండంగా నడుస్తోందని చెప్పారు. పిల్లలు చక్కగా చదవడంతో పాటు ఆటపాటల్లో ఉత్తమ ప్రతిభను చూపిస్తున్నారని తెలిపారు. నరసరావుపేట మండలంలోని పెదతురకపాలెంలో రూ.2.25కోట్లతో ప్రారంభించిన బాలబాలికలకు రెసిడెన్షియల్ స్కూలు, వసతి గృహాలు 80శాతం పూర్తయ్యాయని చెప్పారు. వచ్చే రెండుమూడు నెలల్లో పూర్తిచేసి పట్టణంలోని పిల్లల్ని అక్కడకు మారుస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి ఎల్.వరలక్ష్మి, డీఎఫ్‌వో రామచంద్రరావు, డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, షేక్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆషాభేగం ఖాజావలి, గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ పాలపర్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పీవీఆర్‌కు అథ్లెటిక్ ఓవరాల్ చాంపియన్‌షిప్

గుంటూరు (క్రీడలు): అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బీఆర్ స్టేడియంలో జరిగిన అండర్–10, 12, 14, 16 బాల బాలికల జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీల్లో చుండూరు మండలం యడ్లపల్లి గ్రామానికి చెందిన ఎస్‌పీవీఆర్ జెడ్పీ హైస్కూల్ ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించింది. ద్వితీయ స్థానాన్ని చేబ్రోలుకు చెందిన ప్రెసిడెన్సీ స్కూల్, తృతీయ స్థానాలు లాంకు చెందిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్, గోరంట్లకు చెందిన నెక్స్‌జెన్ స్కూల్ నిలిచాయి. విజేతలను జీవీఎస్ ప్రసాద్ బహుమతులు అందజేశారు.


చాంపియన్‌షిప్ సాధించిన ఎస్‌పీవీఆర్ స్కూల్